

## టేకిట్ ఈజీ!! - 2
## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# దె.దె.వే (హేలోవిన్ స్పెషల్)

స్మశానం పక్కన ఉన్న బస్టాపు. కరెంటు పోలుకి ఉన్న దీపం వెలిగీ, ఆరీ, వెలిగీ, ఆరీ, ఎటూ తేల్చుకోలేకపోతోంది. కను చూపు మేరలో జన సంచారం లేదు. బస్సుకూడ రావట్లేదు. నేను రిషికపూర్లా జెర్కిన్ జేబులో చేతులు పెట్టుకుని చాందినీ కోసం చూస్తున్నాను.. ఎవరన్నా చూస్తే మరో నెలలో డెలివరీకి సిద్ధంగా ఉన్న స్త్రీమూర్తి బస్సుకోసం వెయిట్ చేస్తోందని పొరబడతారు. మన "వెయిట్" అలాంటిది మరి. అటుగా స్కూటరు మీద వెడుతున్న ఓ శాల్తీ ఆగింది. నన్ను చూసి

**"ఏరా, ఈ చీకట్లో ఇక్కడేం చేస్తున్నావు? దెయ్యాలు దెబ్బలాడుకునే వేళ.ఇప్పుడు టైమెంతైందో తెలుసా?"** అంది మగ గొంతుకతో.

**" ఏం, నీకు తెలియదా? "** అన్నాను పొగరుగా.

**" ఒరేయ్, అదికాదురా, పక్కనే స్మశానంరా, బస్సు రాదుగానీ, నేను డ్రాప్ చేస్తాను రా"** అంది.

**"వద్దు, నన్ను స్మశానంలో డ్రాప్ చెయ్యక్కర్లేదు.."** అన్నాను కటువుగా. కాస్త గాప్ ఇచ్చి,

**"నేను బస్సులోనే వెడతాను.."** అన్నాను కృతనిశ్చయంతో.

**"నీఖర్మ"**, అనేసి, ఆ శాల్తీ స్కూటరు గాల్లోకి లేపి పక్కకెళ్ళింది. స్మశానం గేటు తెరుచుకుంది, స్కూటరు లోపలికెళ్ళి మాయమైంది. పేద్ద ఏక్సిడెంటయిన చప్పుడు వినిపించింది అక్కడినించి.

**" ఒక సారి చచ్చావు, అయినా బుద్ధి రాలేదు, కాస్త చూసుకుని నడపరా గూట్లే.."** అనేసి మళ్ళీ బస్సుకోసం ఎదురు చూస్తున్నాను.

ఇంతలో ఇంకో శాల్తీ వచ్చింది కారులో.

బైటకి తలపెట్టి **"మీది ఏం కేష్టు?"** అని అడిగింది.

**"సిమెంటు కేష్టు"** అన్నాను విరిగిన నాకాలికున్న కట్టు చూపిస్తూ.

"అది కాదు, నువ్వు ఏవిటి?" అందా శాల్తీ.

**"ఒరేయ్ దరిద్రుడా, నీకు వ్యాకరణం రాకపోతే నేర్చుకో. మనుషుల్ని "ఎవరు" అని అడగాలి?**

**"ఏవిటి" అని దయ్యాల్ని అడగాలి.."** అన్నాను కోపంగా.

ఆ శాల్తీకి చిర్రెత్తుకొచ్చింది. గ్లవ్ బాక్సులో గొడ్డలికోసం వెతుకుతున్నాడు. నేను వెంటనే ఖాళీగా ఉన్న వాడి కారు వెనకాల సీటు కేసి చూసి **" ఒసేయ్ పింకీ, నువ్వేవిటే ? ఆ తెల్ల చీర ఏమిటి? ఆ రక్తం ఏమిటి? "** అన్నాను.

వాడు కారు ఇరవై ఐదో గేరులో పెట్టి దూసుకెళిపోయాడు.

కాసేపయ్యాకా మరో కారొచ్చింది.."**ఎందుకు ఆగినావు? మీది యే రీజన్?"**

నాకు వళ్ళు మండింది. **"బస్సు రాలేదన్న ఒకే ఒక్క "రీజన్", అందుకే ఆగాను, ఇంక నువ్వు సద్దుకో.."** అన్నాను. వాడికి విరిగిన నాకాలు వెనక్కి తిరిగి కనబడింది. వాడు కారొదిలేసి పారిపోయాడు.

తరవాత కారులోంచి ఒక సోకులాడి దిగింది. నా పక్కనే నించుని నన్ను నమిలేసేలా చూస్తోంది. **" నాకు పెళ్ళైంది.."** అన్నాను గంభీరంగా.

**"నాకు చాలా సార్లయింది. ఇప్పుడే, తరవాతది కూడ అయింది"** అంది సిగ్గుపడుతూ.

**"అవునా, లాయర్ ఎవరు?"** అన్నాను అమాయకంగా.

**"తరవాత దంటే విడాకులు కాదు.."** అంది చికాగ్గా.

**"ఓహో, అప్పగింతలా..సరే. నాగవల్లి ఎప్పుడు?"** అన్నాను ఆసక్తిగా. దానికి అర్థం కాలేదు. తరవాత వచ్చిన కారు రన్నింగ్లో ఎక్కేసి పారిపోయింది.

నేనింకా బస్సుకోసం చూస్తూనే ఉన్నాను. నడిచే ఓపిక లేక. కాలేజీ జంటలు కొన్ని వచ్చి వాలాయి. తెగ ఎడ్వాన్సు అయిపోతున్నాయి.

ఒకమ్మాయి ధైర్యం చేసి చెప్పింది "**అంకుల్, నువ్వు కాసేపు అటుతిరిగి చూడవా బస్సుకోసం"** అని. నేను శరీరం అటేపెట్టి, మెడ మాత్రం పూర్తిగా వెనక్కి తిప్పేసాను. అటునించి ఆర్తనాదాలు వినిపించాయి. ఓ రెణ్ణిమిషాలు అలాగే ఉంచి, యథా స్థానానికి మెడ తిప్పాను. బస్టాపు మళ్ళీ ఖాళీ.

ఇంతలో బస్సు వచ్చి ఆగింది. నేను లోపలికెక్కేసరికి మా దెయ్యాలన్నీ అక్కడే ఉన్నాయి.

**" ఏరా, ఇవాళ ఏ బారు?"** అన్నాను కోపంగా.

**"లేదురా, ఆ ఎదవ పన్నెండింటికి కట్టాలి కదా, ఆడు, ఆ దొంగనా...గాడు, ఒంటి గెంట దాకా అక్కడే చచ్చాడు. ఆడు ఎల్లాకా, మేము లోపల దూరి, తాగి వచ్చేసరికి ఇదిగో ఆల్మోస్ట్ ఫోర్ ఇంద మార్నింగ్.."** అన్నాడు ఒకడు తూలుతూ.

**"అవునుగానీ, నువ్వింత తెల్లారురఝాము దాకా ఏంచేస్తున్నావురా, దెయ్యంగా.."** అన్నాడు ముద్దుగా మరొకాడు నన్ను చూసి.

**"ఏంలేదెహె, సెకండ్ షో అయ్యాకా, లోపలికెళ్ళి క్యూలో నించుని ఫోర్త్ షో చూసి వస్తున్నాను. ఇక్కడిదాకా వచ్చాకా కాలు నొప్పెట్టేసింది. అసలే ఒక కాలు సొట్ట. అందుకని కూర్చున్నాను. "** అన్నాను.

ఇంతలో ఫోను మోగింది. **"హలో, ఆ చెప్పు..."** అన్నాను భయంగా. **"ఏవిటి చెప్పేది, టైము చూసుకున్నారా. తెల్లవారుతోంది, మళ్ళీ మనుషులు తిరిగే వేళ అయింది. ఇంటికొస్తున్నారా, రారా?"** అంది అవతలి కంఠం. **"వస్తున్నా, వచ్చేస్తున్నా, అంటే..వచ్చేసా..."** అనేసి ఫోను స్విచ్చాఫుచేసాను.

బస్సు మెల్లిగా గాల్లోకి లేచి పక్కనే ఉన్న స్మశానం దగ్గర ఆగింది. గేటు తెరుచుకుంది. బస్సు మా కోలనీలోకి ప్రవేశించింది. అందరం ఒకరికొకరు బై చెప్పుకుని, ఇంటికెళ్ళి , పడుకున్నాం.

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS